శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



## శిక్షణా తరగతులను పరిశీలించిన కలెక్టర్



**నెల్లూరు అర్బన్, మే 26, ప్రభాతవార్త** సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపునకు విధులు కేటాయించబడిన సిబ్బంది అందరూ శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని సమర్థవంతంగా కౌంటింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం హరినారాయణన్ సూచించారు. ఆదివారం ఉదయం నెల్లూరు నగరంలో డీకేడబ్ల్యూ కళాశాలలో కౌంటింగ్ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణా తరగతులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల్లో ఓట్ల లెక్కింపునకు సంబంధించిన అన్ని సందేహాలను ముందుగానే నివృత్తి చేసుకోవాలని కౌంటింగ్ సిబ్బందికి సూచించారు. జూన్ 4న కనుపర్తిపాడులోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుందని, భారత ఎన్నికల సంఘం నిబంధనలను పాటిస్తూ కౌంటింగ్ విధులను అప్రమత్తంగా నిర్వహించేందుకు సిబ్బంది సమాయత్తం కావాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట నెల్లూరు సిటీ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వికాస్ మర్మత్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ శర్మద, హెల్త్ ఆఫీసర్ వెంకటరమణ ఉన్నారు.

## నేడు కామాక్షితాయి హుండి లెక్కింపు

**బుచ్చి మే 26 ప్రభాతవార్త** పవిత్రపుణ్యక్షేత్రమైన జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి సన్నిధిలో ఈనెల 27 వ తేది హుండి లెక్కింపు నిర్వహించడం జరుగుతుందని ఆలయ ఇఒ విరూపాక్షుల గిరికృష్ణ తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని ఆయన తెలిపారు.

## మాతినవారిపాలెంలో వైద్యశిబిరాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**కావలి రూరల్, మే 26 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం సర్వాయపాళెం పంచాయతీ మాతినవారిపాళెం గ్రామంలో ఇటీవల ప్రజలు కలుషిత ఆహారం కారణంగా అస్వస్థతకు గురై కావలిలోని ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న సమాచారాన్ని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలుసుకొని వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడి ఆ గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయించారు. ఆదివారం ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వైద్య శిబిరాన్ని సందర్శించి అనారోగ్యానికి గురైన ప్రజల రోగ లక్షణాలు గురించి , వారికి అందిస్తున్న వైద్య సేవలు గురించి వైద్య సిబ్బంది నుండి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రానున్న రోజులలో కూడా ఎలాంటి వ్యాధులు వ్యాపించకుండా అవసరమైన వారందరికి వైద్య పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య అధికారులను కోరారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తనవంతుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎటువంటి సమస్య వున్నా తన దృష్టికి తీసుకురావాలని ఎల్లవేళలా అందుబాటులో వుంటానని తెలిపారు. ప్రస్తుత పరిస్థితులలో పరిశుభ్రత చాలా ముఖ్యమని మీ ఇళ్ళ చుట్టూ వుండే పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలన్నారు. నీటి నిల్వలు వున్నప్పుడు ఆ నీరు పరిశుభ్రంగా వుండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాన్ వెజ్ తెచ్చుకునేటప్పుడు అవి మంచివా లేక పాడైపోయి వుందా అని తెలుసుకోవాలన్నారు. గ్రామంలోని ప్రజలు అతిసార నుండి కోలుకోవడం చాలా సంతోషంగా వుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రతి గ్రామ పంచాయతీలో ప్రజల శ్రేయస్సు కోసం సచివాలయం, ఆర్‌బికె సెంటర్, ఆరోగ్య హెల్త్ సెంటర్లు నిర్మించారన్నారు. రానున్న రోజులలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గద్దెనెక్కితే అందరికి మంచి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కావలి రూరల్ మండల అధ్యక్షుడు జంపాని రాఘవులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దామిశెట్టి సుధీర్‌నాయుడు, శ్రీశైలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, సీనియర్ నాయకులు దామిశెట్టి శ్రీనివాసులనాయుడు, సర్పంచ్ ఇస్సారపు యానాది, కనమర్లపూడి వెంకట నారాయణ, కుందుర్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పెళ్లకూరు కాలనీలో కార్డన్ సెర్చ్
## 20 మోటార్ సైకిళ్ళు,రెండో ఆటోలు స్వాధీనం




**కోవూరు మే 26 ప్రభాతవార్త** కోవూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెళ్ళకూరు కాలనీ ప్రాంతంలో ఆదివారం జిల్లా ఎస్‌పి అదేశానుసారం కోవూరు ఎస్ఐ రంగనాద్‌గౌడ్ ఆధ్వర్యంలో కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎటువంటి పత్రాలు లేని 20 మోటారుసైకిళ్ల రెండు ఆటోలను పోలీ సులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు రానున్న కౌంటింగ్ దృష్ట్యా గ్రామాల లో ఎక్కడైనా అల్లర్లు ఘర్షణ వాతావరణాలు సృష్టిస్తే అటువంటి వారిపై శాఖా పరమైన కఠిన చర్యలు తప్పవని అన్నారు. స్వాధీనం చేసుకున్న వాహనాలు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

## విద్యుత్ నిలిపివేత

**నెల్లూరు, మే 26, ప్రభాతవార్త - వైద్యం** నగరంలోని 33/11 తెలుగుగంగ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి సంజయ్ గాంధీ నగర్ ఫీడర్‌లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా ఏవికె ఎస్టేట్, శాంతి నగర్, తెలుగుగంగ కాలనీ, డైకస్ రోడ్డు, జెకె కాలనీ తదితర ప్రాంతాలలో సోమవారం ఉదయం 7.30 నుండి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అత్యవసర విభాగం వారు తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఆదివారం నెల్లూరు టౌన్ డివిజన్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఏ. సోమశేఖర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు.

## వైభవంగా పోలేరమ్మ జాతర మహోత్సవం



**సీతారామపురం మే 26 ప్రభాతవార్త** సీతారామపురం మండలంలోని ఒగురువాండ్ల పల్లి గ్రామంలో ఆది వారం నిర్వహించిన పోలేరమ్మ జాతర మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులం దరు ఆలయం వద్ద పొంగళ్ళు పొంగించి భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. డప్పు కళాకారులతో కత్తి,గజ్జ ,నృత్యకార్యక్రమాన్ని చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఒగూరువాండ్ల పల్లి కమీటి నిర్వాహకుల నేతృత్వంలో జరిగింది.

## నేడు కోనలో హుండీల లెక్కింపు

**పెంచలకోన(రాపూరు), మే26ప్రభాతవార్త** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలోని శ్రీ పెనుశిల లక్ష్మీ నరసింహ స్వామి వారి హుండి లెక్కింపుకార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఉప కమీషనర్ జె. విజయ సాగర్ బాబు ఆదివారం తెలిపారు. ఈ నెల 19 వ తేది నుండి 25 వ తారిఖు వరకు జరిగిన స్వామి వారి బ్రహ్మోత్సవాలలో స్వామి వారికి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించడం జరుగుతుందని తెలిపారు. ఈ లెక్కింపులో మండల రెవెన్యూఅ ధికారులు,పోలీస్ సిబ్బంది, ఎస్.బి.ఐ రిటైర్డ్ ఉద్యోగులు, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు పెంచలకోన సిబ్బంది,దేవస్థానం రిలీజియస్ సిబ్బంది, సెక్యులర్ సిబ్బంది,మోతకాపులు పాల్గొంటారన్నారు. ఈ లెక్కింపులో భక్తులు సైతం ఎలాంటి బంగారు,వెండి ఆభరణాలు లేకుండా పంచ,ధోవతి ధరించి పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

# ఎన్నికల కమిషన్ పక్షపాతంగా వ్యవహరించింది : మంత్రి కాకాణి

### కౌంటింగ్ పై పలు అనుమానాలు
### జిల్లా ఎన్నికల అధికారులు, పోలీసులపై తీవ్ర విమర్శలు



**నెల్లూరు రూరల్, మే 26, ప్రభాతవార్త** 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ పక్షపాత ధోరణితో వ్యవహరించిందని మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపించారు. ఆదివారం పొదలకూరు రోడ్డులోని ఆయన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ పోలీస్ అధికారులను ఉద్దేశ్యపూరితంగా బదిలీ చేసిందని ఆయన అన్నారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన పోలీస్ అధికారులు ఉద్రిక్తలు రెచ్చగొట్టారు. వైసిపి బలంగా ఉన్న చోట క్యాడర్‌ని భయభ్రాంతులకు గురిచేసిందని తెలిపారు. మాచర్ల ఘటన వీడియో ఎలా బయటికి వచ్చిందో చెప్పలేని దుస్థితిలో ఎన్నికల కమిషన్ ఉందన్నారు. ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిష్పక్షపాతంగా వ్యవహరించలేదని ఆయన ఆరోపించారు. నెల్లూరు జిల్లాలోని కొన్ని పోలింగ్ బూతుల్లో కనీస మౌలిక వసతులు ఓటర్లకు కల్పించలేదన్నారు. ఎన్నికల నిర్వహణలో జిల్లా ఎన్నికల యంత్రాంగం ఘోరంగా విఫలమైంది. మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల నిధులు దుర్వినియోగం, వైఫల్యం పై జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) పై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసామన్నారు. మాజీ మంత్రి సోమిరెడ్డి పట్టపగలు ఓటర్లకి డబ్బులు పంచితే దాని మీద వీడియో క్లిప్పింగ్, ఆధారాలతో సహ ఫిర్యాదు చేస్తే జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) పట్టించుకోలేదని తెలిపారు. మానవతా దృక్పథంతో సోమిరెడ్డి డబ్బులు పంచాడని జిల్లా ఎన్నికల అధికారి నివేదికలో పేర్కొనడం హాస్యాస్పదమన్నారు. ఈ వ్యవహారం పై ఎన్నికల కమిషన్ స్పందించకపోతే హైకోర్టుకు వెళ్తున్నానని తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు డబ్బులు పంచారని సోషల్ మీడియాలో వచ్చిన వార్త ఆధారంగా తోటపల్లి గూడూరు పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎన్నికల అధికారి (జిల్లా కలెక్టర్) ఆదేశాలతో ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేసిన జిల్లా కలెక్టర్ పక్షపాత ధోరణితో పని చేశారని చెప్పడానికి ఇంత కన్నా ఉదాహరణ కావాలా? ఆయన ప్రశ్నించారు. జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో ఓట్ల లెక్కింపు సజావుగా సాగుతుందనే నమ్మకం మాకు లేదన్నారు. కౌంటింగ్ నిర్వహణకు ఒక అబ్జర్వర్‌ను నియమించాలని ఎన్నికల సంఘాన్ని కోరుతున్నామని ఆయన తెలిపారు.

## సదరన్ చానల్‌లోకి చెపలగుంటల వేస్టు నీరు పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



**బుచ్చి మే 26 ప్రభాతవార్త** సదరన్ ఛానల్ ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుంది. ఈ కాలువలోకి చేపల గుంటల వేస్టు వాటర్ ( చికెన్ వేస్టేజి వేస్తున్న నీరు) విడుదల చేస్తున్నారు. దీనిపై ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాని ఇరిగేషన్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. మినగల్లు నుండి సదరన్ చానల్ గట్టుపైన ప్రయాణం చేస్తున్న ప్రజలు ముక్కుమూసుకొని ప్రయాణాలు సాగిస్తున్నారు. ఈ కాలువలలో నీరు తాగిన మూగజీవాలు అనారోగ్యాలపాలౌతున్నారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సదరన్ చానల్‌లోకి చేపలగుంటల నీరు విడుదల కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోతే ఆయా గ్రామాల ప్రజలు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొని వెళ్ళనున్నట్లు తెలిపారు.

## కోడిపందాల స్థావరాలపై మర్రిపాడు పోలీసుల దాడి

**మర్రిపాడు, మే26, ప్రభాతవార్త :** మ ర్రిపాడు మండలం పొంగూరు పొలాల్లో ఆదివారం సాయంత్రం జరుగుతున్న కోడిపందాల స్థావరాలపై మర్రిపాడు ఎస్ఐ విశ్వనాథరెడ్డి తన సిబ్బందితో కలసి మెరుపుదాడులు చేశారు. ఈసందర్భంగా కోడిపందాలు ఆడుతున్న 9మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రెండు కోళ్ళను, 3460రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు. ముందుగా అందిన సమాచారం మేరకు ఈదాడులు నిర్వహించామని ఎస్ఐ తెలిపారు. మర్రిపాడు మండలంలో ఎలాంటి అవాంచనీయ, అసాంఘిక కార్యక్రమాలు జరిగినా సహించేది లేదని, నిందితులు ఎంతటివారైనా ఉపేక్షించబోమని ఎస్ఐ విశ్వనాథరెడ్డి హెచ్చరించారు.

**మర్రిపాడులో 30యాక్ట్** అమలు సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ఎలక్షన్‌కమీషన్ నిబంధనల మేరకు జూన్ 6వ తేదీ వరకు పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని మర్రిపాడు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలకు సంబంధించి ఎక్కడా కూడా పోలీసు శాఖ తరపున ఎలాంటి పర్మిషన్లు ఇవ్వలేదని, ఎక్కడా ఇచ్చే అవకాశం కూడా లేదన్నారు. పోలీస్ నిబంధనలను గ్రామాల్లో ఎవరైనా ఉల్లంఘిస్తే అలాంటివారిపై కఠినచర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామాల్లో ఊరేగింపులు, అశ్లీలత ప్రదర్శనలు , ర్యాలీలు, బాణాసంచా పేల్చడం తదితరాలపై నిషేదాజ్ఞలు ఉన్నాయన్నారు.

## మరగుజ్జు మహిళకు సాయం



**మనుబోలు, మే 26, ప్రభాతవార్త** గూడూరు ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని మడమనూరు గ్రామానికి చెందిన మరగుజ్జు మహిళ వెంకటరత్నమ్మకు ఆదివారం ఫలసరుకులను పంపిణీ చేశారు. గూడూరుకు చెందిన ప్రగతి సేవాసంస్థ ఆధ్వర్యంలో కీ.శే పొనక ఆదిశేషారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు పొనక మల్లిఖార్జునరెడ్డి సంపూర్ణ సహకారంతో నిరుపేదలకు ప్రతి నెల ఫల సరుకులు పంపిణీ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ ప్రయత్నంలో మనుబోలు హైస్కూల్ సైన్సు టీచర్ మాముడూరు రాధయ్య సహకారంతో మరగుజ్జు మహిళ వెంకటరత్న మ్మకు సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ చేతుల మీదుగా 18 రకాల ఫల సరుకులను అందజేశారు. మరగుజ్జు మహిళను గుర్తించి ఫల సరుకులు ఇచ్చిన ప్రగతి సేవా సంస్థకు మడమనూరు గ్రామస్తులు ధన్య వాదాలు తెలిపారు.

## బీరంగుంట గ్రామంలో అధికారులు పర్యటన



**అల్లూరు, మే 26 ప్రభాతవార్త** అల్లూరు మండల పరిధిలోని బీరంగుంట గ్రామంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా జరిగిన ఘర్షణలు దృష్టిలో పెట్టుకుని ఆదివారం కావలి డిఎస్పీ వెంకట రమణ, ఆర్డీవో శీనానాయక్, తహశీల్దార్ దుర్గేశ్వరరావు, కావలి రూరల్ సిఐ నాగభూషణం, ఎస్ఐ పి.శ్రీనివాసులరెడ్డిలు గ్రామస్తులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పీ వెంకట రమణ మాట్లాడుతూ ఎన్నికల రోజున బీరంగుంటలో జరిగిన అల్లర్లు దృష్టిలో పెట్టుకొని ఈ గ్రామంలో పర్యటించడం జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు రోజున టపాసులు పేల్చడం, ఊరేగింపులు చేయరాదన్నారు. 144 సెక్షన్ అమలులో వుందన్నారు. ఓట్ల లెక్కింపు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని కోరారు. ఓట్ల లెక్కింపు రోజున ఎటువంటి అల్లర్లు, గొడవలు జరగకుండా ప్రజలు ప్రశాంతంగా వుండాలని కోరారు.

## వీరంపల్లిలో పోలీసుల తనిఖీలు



మనుబోలు, మే 26, ప్రభాతవార్త మండలంలోని వీరంపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం సీఐ రాంబాబు, ఎస్సై అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జూన్ 4వ తేదీ ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో పోలీసులు అన్ని గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ మొదలు పెట్టారు. అనుమానిత వ్యక్తులు మారణాయులు, మాదక ద్రవ్యాలు, పేలుడు పదార్థాలు ఉన్నాయనే కోణంలో ప్రతి ఇంటికి వెళ్లి తనిఖీలు చేసి జల్లెడ పట్టారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్సై అనుమానపు వ్యక్తులను ప్రశ్నించారు. ఎలాంటి కాగితాలు లేని మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ చేశామని, అన్ని గ్రామాల్లో ఈ తనిఖీలు చేసి ఎన్నికల కౌంటింగ్ ప్రశాంతంగా, సజావుగా జరిగేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

# రాపూరులో పడకేసిన పారిశుధ్యం..పెరుకుపోయిన చెత్త

### ..అల్లాడుతున్న ప్రజలు..పట్టించుకోని పాలకులు,అధికారులు





**రాపూరు, మే 26 ప్రభాతవార్త** మండల కేంద్రమైన రాపూరు పంచాయితీలో పారిశుధ్యం అధ్వనంగా తయారు అయ్యింది. గత కొద్ది రోజులుగా చెత్త కుప్పలను పంచాయితీ పారిశుధ్యం సిబ్బంది తొలగించక పోవడంతో పట్టణంలోని పలు ప్రాంతాలలో ఎక్కడిచెత్త అక్కడే పేరుకుపోయి రోడ్డు మీదకు వచ్చి ప్రజలు రోడ్డుపై తిరిగేందుకు కూడా ఇబ్బందులకు గురిచేస్తుంది. పంచాయితీలో పారిశుధ్యం సిబ్బంది తక్కువగా వుండటంతో వున్న వారికి ప్రతి రోజు మెయిన్ బజారును శుభ్రం చేసేందుకే సమయం చాలడం లేదు. దీంతో పట్టణంలోని పలు కూడళ్లలో వున్న చెత్త తొట్టిల వద్ద చెత్త నిండిపోయి దుర్గంధం వేదజల్లుతూ వుంది. దీనికి తోడు పంచాయితీలో పందులు ఎక్కువగా వుండటంతో అవి చెత్తపైచేరి చెత్తను చెరవతుండటంతో దుర్గం ఎక్కువగా వుంది. ప్రధానంగా రాపూరులో పవిత్రమైన దేవాలయాలు వున్న ప్రదేశంలో మరి ఎక్కువగా చెత్త పేరుకుపోయింది. దీంతో పాటు రాపూరు ఆరుంధతాయ వాడలో కొత్తగానిర్మించిన రోడ్డుపై చెత్త గుట్టగా పెరుకుపోయి ఈ దారిలో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పట్టణంలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

## జాతీయ పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోండి

**కావలి రూరల్, మే 26 ప్రభాతవార్త** తెలుగు సంస్కృతి సాహితీ సేవ ట్రస్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జూన్ 16వ తేది వరంగల్ ప్రెస్‌క్లబ్‌లో జాతీయ పురస్కారాల కార్యక్రమం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పురస్కారాలకు వివిధ రంగాలలో కృషి చేసిన వారు, జాతీయ నవస్ఫూర్తి, నవకీర్తి, లెజండరీ, స్వర్ణనంది, మహానంది, స్వర్ణకంకణ,ఐరావతం అవార్డు పురస్కారాలకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. సాహిత్యం, రచన, కవులు, కళాకారులు, సంగీతం, నృత్యం, భరత నాట్యం, కూచిపూడి, కోలాటం, చిత్రలేఖనం, శిల్పం, నాటకం, జానపదం, మిమిక్రి, అవధానం, విద్య, వైద్యం, ఇంద్రజాలం, ముఖాభినయం, హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, రంగస్థల కళాకారులు, జ్యోతిష్యం, సైన్స్ అండ్ టెక్నాలజీ, వాస్తు, యోగా, హార్మోనియం, భజనకళ, సామాజిక సేవ, క్రీడలు, షార్ట్ ఫిలిం, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణాభివృద్ధి, గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు, వివిధ రంగాలలో పనిచేస్తున్న వారు పురస్కారాలకు జూన్ 10వ తేది లోపు దరఖాస్తు చేసుకోవాలని డాక్టర్ మాచవరం గౌరిశంకర్ తెలిపారు. సెల్ నెంబర్లు 7382592852,9985275389 నెంబర్లలో వివరాల కోసం సంప్రదించవచ్చని తెలిపారు.

## సరదాగా తాటికాయలు కోసిన ఎమ్మెల్యే



**కావలి రూరల్, మే 26 ప్రభాతవార్త** కావలి రూరల్ మండలం సర్వాయపాళెం గ్రామ పంచాయతీ మాతినవారిపాళెంలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వేసవికాలం తాటికాయలు సీజన్ అయినందున పలువురు గ్రామ ప్రజల కోరిక మేరకు తాటి ముంజులు తినాలని ఎమ్మెల్యేని కోరారు. వారి కోరిక మేరకు ఆయన కొంతసేపు తాటికాయలను చాకచక్యంగా కొడవలితో కోసి అక్కడ వున్న నాయకులకు ఇచ్చి అందరిని ఆశ్చర్యానికి గురిచేశారు. అక్కడ వారంతా తాటి కాయలను ఎమ్మెల్యే కోసే విధానాన్ని చూసి ముక్కున వేలు వేసుకొని ఆశ్చర్యానికి గురయ్యారు. తన చిన్ననాటి జ్ఞాపకాలను ఎమ్మెల్యే గుర్తు చేసుకున్నారు. నాయకులతో ఆయన సరదాగా గడిపారు.

## విద్యుత్ అక్రమ వాడకం నేరం

**నెల్లూరు, మే 26, ప్రభాతవార్త - వైద్యం** విద్యుత్ అక్రమవాడకం చట్టరిత్యా నేరమని విద్యుత్ శాఖ విభాగ విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. శనివారం కోవూరు నెల్లూరు రూరల్ నియోజకవర్గం పలు చోట్ల రాత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కోవూరు డివిజన్, నెల్లూరు రూరల్స్ డివిజన్‌లో డిపిఈ విజిలెన్స్ విభాగం అధికారులు రాత్రి రొయ్యలగుంటలకు అక్రమ విద్యుత్ వాడుతున్న వారిపై నైట్ రైడ్స్ నిర్వహించడం జరిగింది. ఈ నైట్ రైడ్స్‌లో విద్యుత్ డిపిఈ విభాగ అధికారులు, ఏపిటిఎస్ సర్కిల్ వారి సిబ్బంది పాల్గొన్నారు. ఈ నైట్ రైడ్స్‌లో రొయ్యల గుంటలకు అక్రమ విద్యుత్ వినియోగిస్తున్న ఇద్దరు రొయ్యల గుంటల రైతులకు, ఇద్దరు గృహ వినియోగదారులకు సుమారు 3 లక్షల వరకు అపరాధ రుసుము విధించినట్లు డిపిఈ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్ తెలియజేశారు. వారికి వెంటనే నోటీసులు పంపిస్తున్నామని తెలిపారు. విద్యుత్ సౌర్యం పై ఆకస్మిక తనిఖీలు జరుగుతూ ఉంటాయని, వినియోగదారులు అక్రమ విద్యుత్ వాడకం చట్ట రీత్యా నేరమని డిపిఈ విభాగం వారు తెలిపారు.

## ఘర్షణలకు పాల్పడితే చర్యలు తప్పవు



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** కోవూరు నియోజకవర్గానికి సంబంధించి జూన్ 4వ తేది కౌంటింగ్ జరుగుతున్న దృష్ట్యా ఎక్కడైనా ఘర్షణ వాతావరణం జరిగినా ఏమైనా అనుకోని సంఘటనలు చోటుచేసుకున్నా అటువంటి వారిపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వారిపై కఠిన చర్యలు తప్పవని కోవూరు తహసీల్దార్, ఏఈఆర్‌వో విజయశ్రీ పేర్కొన్నారు. కోవూరులోని పలు ప్రాంతాల్లో కోవూరు ఎస్సై రంగనాథ్ గౌడ్‌తో కలిసి ప్రజలకు, ఇతర వ్యక్తులకు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కోవూరు మండలంలో ఎక్కడా కూఆ ప్రశాంత వాతావరణం ఉండాలని, టీవీలో ఎలక్షన్ సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు వస్తుందని, వాటిని వీక్షించాలే తప్ప బయటకు వచ్చి ఘర్షణ వాతావరణం సృష్టించరాదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, తదితరులు ఉన్నారు.

## అశ్వ వాహన సేవలో కోదండరాముడు



**కోవూరు, మే 26 ప్రభాతవార్త** : కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యుల ఆధ్వర్యంలో అభిషేక పూజలను సాంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారు అశ్వవాహన సేవలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివారు అశ్వ వాహనంలో కోవూరు పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి ఉభయ కర్తలుగా శాంతినగర్‌కు చెందిన పూనూరు జగన్‌మోహన్‌రెడ్డి, పూనూరు హర్షవర్ధన్‌రెడ్డిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, భక్తులు ఉన్నారు.

**నేడు స్వామివారికి చక్రస్నానం** కోదండరామ స్వామి దేవస్థానంలో సోమవారం వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి తిర్చి ఉత్సవం, తీర్థవాది, ధ్వజారోహనం కార్యక్రమాలతో పాటు స్వామివారికి ప్రత్యేకంగా చక్రస్నానం కార్యక్రమాలను నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు తెలిపారు.

## ఏఎస్‌పేట దర్గాను దర్శించుకున్న కేతంరెడ్డి



అనుమసముద్రంపేట,మే26,ప్రభాతవార్త : మండల కేంద్రమైన ఏఎస్‌పేట లోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన హజరత్ సయ్యద్ ఖాజా రహమతుల్లా నాయబ్‌రసూల్ వారి దర్గాను ఆదివారం టిడిపి నాయకులు కేతంరెడ్డి వినోద్‌రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన హజరత్‌వారి సమాధులపై పూలచాదర్లు సమర్పించి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని, విపిఆర్ నెల్లూరు ఎంపిగా గెలవాలని, జిల్లాలోని అన్ని స్థానాల్లో టిడిపి అభ్యర్థులు గెలవాలని ప్రార్థించామన్నారు. ఆంధ్రరాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. ఇంతటి ప్రముఖ పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోవడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈసందర్భంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ జూన్ 4నజరగబోయే ఓట్లు లెక్కింపులో తెలుగుదేశంపార్టీ ఆంధ్రరాష్ట్రంలో విజయఢంకా మ్రోగించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో మైనార్టీ నాయకులు ఫజల్, స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# మూడేళ్లుగా ఉపయోగపడని మంచినీటి వాటర్ ప్లాంట్



**కోవూరు, మే 26 ప్రభాతవార్త :** కోవూరులోని రాళ్లమిట్ట ప్రాంత ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలనే ఉద్దేశంతో 2019వ సంవత్సరంలో ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని రాజ్యసభ సభ్యుడు వైఎస్‌పి చౌదరి నిధులు రూ. 5 లక్షలు వ్యయం చేసి ఈ ప్రాంత ప్రజలకు ఈ ప్లాంట్‌ను ప్రారంభించేలా చర్యలు తసీఉకున్నారు. కేవలం కొద్దికాలం మాత్రమే ఉపయోగపడిన ఈ వాటర్ ప్లార్ అనంతరం మరమ్మతలకు గురైంది. మోటార్ కాలిపోవడం ఈ ప్రాంతంలో మంచినీరు బోరు సక్రమంగా నీరు రాకపోడవంతో గత మూడేళ్లగా మమరమ్మతుల్లో ఉన్న ఈ వాటర్ ప్లాంట్‌ను పట్టించుకునే నాధుడే కరువయ్యారు. ఫలితంగా ఈ ప్రాంత ప్రజలు మంచినీటి క్యాన్‌లను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇందుకు ప్రధాన కారణం ఈ ప్రాంతంలో ఏర్పడిన వర్గపోరు కారణంగా



ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. ఒక వర్గానికి మరమ్మతులుకు సంబంధించిన విషాన్ని చెబితే మరో వర్గం ఎక్కడ తమపైకి వస్తుందో అని మిన్నకుండి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో స్థానిక ఎమ్మెల్యే ఎంతో సదుద్దేశంతో ఇతర జిల్లలకు సంబంధించి రాజ్యసభ సభ్యులు నుంచి నిధులు తెచ్చి ఈ ప్రాంత ప్రజలకు సురక్షితమైన నీరు అందించాలనే లక్ష్యం నెరవేరకుంది. ప్రస్తుతం వేసివి కాలం కావడంతో ప్రజలు మంచినీటి క్యాన్లు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గత మూడేళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్న ఈ మంచినీటి వాటర్ ప్లాంట్‌ను ప్రజలకు ఉపయోగడే విధంగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# సామాజిక ఆరోగ్య కేంద్రానికి వాషింగ్ మిషన్



**కోవూరు, మే 26 ప్రభాతవార్త** : కోవూరులోనేఇ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గత దశాబ్దాల కాలంగా రోగుల బెడ్‌కు సంబంధించిన దుప్ప ట్లు, ఇతరత్రా వస్తువులను దోబీల ద్వారా ఉతికించేవారు. ఇందుకు నెల కు 600 నుంచి 1000 రూపాయల ద్వాకా వ్యయం అయ్యేది. ఈ నేప థ్యంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజేత ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఆసుపత్రి నిధులతో ప్రత్యేకంగా ఒక వాషింగ్ మిషన్‌ను కొను గోలు చేసి దానిని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేశారు. ఆసు పత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ విజేత బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఆసుపత్రి అభివృద్ధి పట్ల ప్రత్యేక దృష్టి సారించారు. గత దశాబ్దాల కాలంగా ఈ ఆసుపత్రికి ప్రధాన రహదారి నుంచి రోగులు వర్షాకాలంలో వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు నెలకొనే పరిస్థితి ఉండేది. ఈ నేపథ్యంలో డాక్టర్ విజేత ప్రత్యేకంగా చొరవ తీసుకుని ఆరోగ్య శాఖకు ఆసుపత్రి నుంచి పోస్టుమార్టం గది వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం, పాత గదులకు మరమ్మతులకు నిధులు కావాలనే పదేపదే లేఖలు రాయడం జరిగింది. ఈ నేపథ్యంలో ఇటీవల కాలంలో మంజూరైన నిధులతో సిమెంట్ రోడ్డు నిర్మాణం కూడా పూర్తయింది. దీనికి తోడు ఆసుపత్రిలో ఉన్న ప్రత్యేక పారిశుధ్య సిబ్బందితో ఆసుపత్రి పరిసరాలు ఎప్పుడూ పరిశుభ్రడంగా ఉండేలా చర్యలు తీసుకోవడం పట్ల ఆసుపత్రికి వచ్చే రోగులు హర్షాతిరేఖాలు వ్యక్తం చేస్తున్నారు.

# కావలి తుఫాన్‌నగర్‌లో కార్డన్ సర్చ్ నిర్వహించిన టు టౌన్ పోలీసులు



**కావలి, మే 26 ప్రభాతవార్త కావలి** పట్టణ తు ఫాన్‌నగర్‌లో ఆదివారం కావలి రెండవ పట్టణ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కొండవీటి శ్రీనివాసరావు ఆధ్వ ర్యంలో పోలీసులు కార్డన్ సర్చ్ నిర్వహించారు. ఈ తనిఖీలో సరైన పత్రాలు లేని పలు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడారు. నెల్లూరు ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని పో లీస్ స్టేషన్ల పరిధిలో కార్డన్ సర్చ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూన్ 4వ తేది ఓట్ల లెక్కింపు కాం´ణంగా ఆయా ప్రాంతాలలో ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా కార్డన్ సర్చ్ చేస్తు న్నట్లు తెలిపారు. సరైన పత్రాలు లేని వాహ నాలను, అనుమానస్పదంగా వున్న వ్యక్తులను, మార ణాయుధాలను స్వాధీనం చేసుకుంటున్నట్లు తెలిపారు. కావలి డిఎస్పీ వెంకట రమణ పర్యవేక్షణలో విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. సామాన్య ప్రజల్లో మన ధైర్యం నింపుతూ పోలీస్ వ్యవస్థ పట్ల విశ్వాసం పెంచడానికి కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సర్చ్‌లో సరైన పత్రాలు లేని 14 బైక్‌లను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టు టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ఐలు, ఎఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ల పాల్గొన్నారు.

## ఎంసిసి రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవు : సిఐ హైమారావు



**బుచ్చి మే 26 ప్రభాతవార్త** ప్రజలు ఎంసిసి రూల్స్ అతిక్రమిస్తే చర్యలు తప్పవని సిఐ హైమారావు హెచ్చరించారు.బుచ్చిరెడ్డిపాళెంలోని పలుగ్రామాలలో ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. నాపార్టీ గొప్ప.... నాపార్టీ గొప్ప అని గొడవలకు తిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారిపైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని అన్నారు. సమస్యాత్మక గ్రామాలపైన ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన తెలిపారు. రాజకీయ పార్టీలకు సంబందించి ఏదైనా గొడవలకు దిగితే చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.ఆయన వెంట రెవిన్యూ ఇనస్పెక్టర్ సాగర్ పోలీస్,రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

## గ్రంధాలయంలో కొనసాగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు



ఉలవపాడు, మే 26, ప్రభాతవార్త వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా ఉలవపాడు శాఖా గ్రంధాలయంలో ఆదివారం విద్యార్థులతో నీతి కథలు చదివించి డిక్టేషన్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ బహుమతులను స్వర్గీయ దేవరపల్లి వెంకట కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమార్తె కోటిరెడ్డి సుచరితారెడ్డి స్పాన్సర్ చేశారు. వారికి గ్రంధపాలకుడు డి.కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిధిగా పాల్గొన్న అనంతపురం జిల్లాలో పాధ్యాయురాలుగా పనిచేస్తున్న ఎం.సుజాత మాట్లాడుతూ విద్యతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో అవసరం అని అప్పుడే సమాజంతో పాటు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురాగలరని చెప్పారు. అనంతరం బ్రహ్మయ్య మన్నేటికోట పిల్లలకు భోజనం ఏర్పాటు చేశారు.

## అంధులకు, దివ్యాంగులకు సంత్ సూరదాస్ ఆదర్శప్రాయుడు



**కావలి, మే 26 ప్రభాతవార్త** అంధులకు, దివ్యాం గులకు సంత్ సూరదాస్ ఆదర్శప్రాయుడని సామా జిక సమరసత ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ కొమ్మిశెట్టి కార్తికేయ తెలిపారు. ఆదివారం కావలిలోని ఆర్‌యస్ యస్ కార్యాలయంలో జాతీయ దివ్యాంగుల సంస్థ సక్షం ఆధ్వర్యంలో సంత్ సూరదాస్ జయంతి నిర్వ హించారు.సక్షం కావలి డివిజన్ కన్వీనర్ మంగళగిరి వేణుగోపాల్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో కార్తికేయ మాట్లాడారు. పుట్టుగుడ్డి వాడైన సూర దాస్ సంగీత, సాహిత్య రంగాలకు, భక్తి ఉద్యమానికి ఎనలేని సేవలందించారని తెలిపారు. ఈ కార్యక్రమం లో సక్షం జిల్లా కార్యవర్గ సభ్యులు చెవికల భాస్కర్, తిరుపతిస్వామి, నరసింహ, శ్రీను, అమరావతి కృష్ణ, ఆర్యవైశ్య ప్రముఖులు నేరెళ్ళ సుధారాణి, కామాక్షి, హేమలత, బి.వి.లక్ష్మి, ఓరుగంటి వెంకటేశ్వర్లు, కొండల రావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం దివ్యాంగుల కు స్టీల్ సామాగ్రి పంపిణీ చేశారు.

## ఈ వేసవిలో దీర్ఘకాలిక రోగులు, వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి



**కోవూరు, మే 26 ప్రభాతవార్త** : ప్రస్తుతం ఈ వేసవిలో విపరీతమైన ఎం డగాలులు వీస్తున్న నేపథ్యంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆయుర్వేద వైద్యులు డాక్టర్ గంగాధర్ తెలిపారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయన మాట్లాడు తూ ప్రధానంగా దగీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారు క్రమం తప్పకుండా మందులు తీసుకోవబమే కాకుండా వైద్యులు సలహాలు, సూచనల మేరకు పౌష్టాకాహారాన్ని సమపాళ్లలో తీసుకోవాలన్నారు. అదేవిధంగా వృద్ధులు 10 గంటల తర్వాత బయల తిరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కోవూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసి ఉన్న ఆయుర్వేదిక్ వైద్యశాలలో అనేక దీర్ఘకాలిక వ్యాధులను, ఇతర వ్యాధులను నయం చేసే మందులు ఉన్నాయని, వాటిని వారు పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలన్నారు.

# దేశం కోసం ప్రాణాల్ని పణంగా పెట్టిన సైనికుల్ని గౌరవించుకోవడం మన సంప్రదాయం



**బిట్రగుంట, మే 26 ప్రభాతవార్త** దేశం కోసం ప్రాణాల్ని పణంగా పెట్టే సైనికుల్ని గౌరవించుకోవడం మన సంప్రదాయ మని బిట్రగుంట వాకర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులు చెప్పారు. బిట్రగుంటలోని రైల్వే ఇన్స్‌టిట్యూట్ మైదానంలో ఆదివారం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మన ఊరు-మన సైనికులు కార్యక్రమం కింద మాజీ సైనికుల్ని, మృతి చెందిన మాజీ సైనికుల కుటుంబ సభ్యులను ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిట్రగుంటకు చెందిన వ్యక్తులు మిలటరీలో వివిధ విభాగాలలో పనిచేసి ఎన్నో ప్రశంసలు అందుకున్నారన్నారు.ఇటీవల కొంతమంది సైనికులు వయోబారం, అనారోగ్యంతో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సర్జన్ మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ఇటీవల కాలంలో మన ఊరు-మన ప్రముఖులు కార్యక్రమం కింద వివిధ రంగాలలో సేవలందిస్తున్న వారిని సత్కరించడం, వారి సేవల్ని వెలుగులోకి తేవడం కొత్త సాంప్రదాయానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా జరుగుతున్న కార్యక్రమాలకు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తమవంతు సహకారం అందించడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు, మృతి చెందిన సైనికుల కుటుంబ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

వార్త
రిపోర్టర్స్ కావలెను
తెలుగు దిన పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న వార్త దిన పత్రిక నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని దగదర్తి, కందుకూరు, లింగసముద్రం మండలాలలో విలేకర్లు కావలెను.
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
వార్త కార్యాలయం, ఎ.కె.నగర్, ఇండస్ట్రీయల్ ఎస్టేట్, నెల్లూరు.
సెల్ నెం: 7675867756